సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 26 । ఆగస్టు । 2025



వాట్సాప్ వ్యవసాయం
వ్యవసాయ సమాచారాన్ని రైతులకు అందించేందుకు ప్రత్యేకంగా వాట్సాప్ ఛానల్‌ను వ్యవసాయశాఖ ప్రారంభించింది.
- 8లో ▸



ప్రజావాణికి 102 ఫిర్యాదులు
ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.1 /21.1

వాతావరణం
ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠినచర్యలు



నిజామాబాద్‌నాగారం: విద్యా సంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడే వారికి జైలు శిక్షతోపాటు కోర్సుల నుంచి సస్పెన్షన్ తప్పదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఉదయ భాస్కర్‌రావు స్పష్టం చేశారు. న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించి ర్యాగింగ్ ఘటనపై విచారించారు. బాధిత విద్యార్థి రాహుల్‌రెడ్డితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి భాస్కర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. సీనియర్లు జూనియర్లను ర్యాగింగ్ చేయకుండా యాంటీ ర్యాగింగ్ కమిటీ ప్రతినిధులు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అవగాహన కల్పించడంతోపాటు వాల్ పోస్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే లీగల్ సెల్ (9440901057)ను సంప్రదించాలని సూచించారు. రాజ్‌కుమార్‌సుబేదార్, బాలాజీ, విశ్వక్, తదితరులుపాల్గొన్నారు.

విద్యార్థి తల్లిదండ్రుల వినతి

బాధిత విద్యార్థి రాహుల్ తల్లిదండ్రులు జడ్జి ఉదయభాస్కరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. కళాశాలలో ర్యాగింగ్ జరుగుతున్నా పట్టించుకునే వారు లేరన్నారు. కనీసం తమకు కూడా సమాచారం అందించలేదని బాధపడ్డారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

ప్రభుత్వ భవనాల లెక్కింపు



నిజామాబాద్ సిటీ: ప్రభుత్వ భవనాలకు సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రభుత్వ భవనాల గుర్తింపు, వివరాల నమోదు ప్రక్రియను మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు చేపట్టారు. నిజామాబాద్ మున్సిపల్ ఈఈ మురళీ మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో ఇంజినీరింగ్, పంచాయతీరాజ్ , పబ్లిక్ హెల్త్ విభాగం ఏఈలు ప్రభుత్వ భవనాల వివరాలు సేకరిస్తున్నారు. గూగుల్ మ్యాప్‌తోపాటు భువన్ యాప్‌లో ప్రభుత్వ భవనాలు గుర్తిస్తున్నారు. జిల్లాలో మొత్తం 742 ప్రభుత్వ భవనాలు ఉన్నట్లు గుర్తించిన అధికారులు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ప్రభుత్వ భవనాలకు విద్యుత్ ఖర్చులు తగ్గించుకునేందుకు సోలార్ వ్యవస్థను ఏర్పాటుచేయనున్నట్లు తెలిసింది.

జీరో విద్యుత్ ప్రమాదాలు లక్ష్యంగా కృషి

సుభాష్‌నగర్: విద్యుత్ ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యంగా వినియోగదారులు, రైతులకు విద్యుత్‌పై అవగాహన కల్పిస్తూ విస్తృత ప్రచారం చేస్తున్నామని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఆర్ రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు 'పొలం బాట' కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటివరకు 592 లూజ్ లైన్లు, 582 వంగిన పోల్స్‌ను సరి చేశామని, 939 మధ్య స్తంభాలు నెలకొల్పామని తెలిపారు. పొలంబాట సత్ఫలితాలనిస్తోందని పేర్కొన్నారు. 789 లో లెవెల్ లైన్ క్రాసింగ్, 1017 డబుల్ ఫీడింగ్ పాయింట్లను మార్చామని, తక్కువ ఎత్తులో ఉన్న 674 డీటీఆర్ ప్లింత్‌లను ఎత్తు పెంచామని వివరించారు. జీరో ప్రమాదాల లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్నామని, విద్యుత్ సమస్య తలెత్తితే టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలని ఎస్ఈ కోరారు.

మారథాన్‌లో కానిస్టేబుల్‌కు మెడల్



జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన పిల్లి మహిపాల్ హైదరాబాద్‌లో జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన మారథాన్‌లో సత్తా చాటారు. నెక్లెస్‌రోడ్ నుంచి గచ్చిబౌలి స్టేడియం వరకు నిర్వహించిన మారథాన్‌లో మహిపాల్ 21.1 కిలోమీటర్ల పరుగును 2.02 గంటల్లో పూర్తి చేసి మెడల్ అందుకున్నారు. 28వేల మంది 5, 10, 21 కిలోమీటర్ల విభాగాల్లో పాల్గొన్నట్లు మహిపాల్ తెలిపారు. జనవరిలో జరిగే టాటా ముంబై మారథాన్‌లో పాల్గొంటానన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విచారణ చేస్తున్న యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యులు, అధికారులు





తమ బంగారు భవిష్యత్‌పై ఆలోచన లేకుండా జూనియర్‌ను ర్యాగింగ్ చేసిన సీనియర్ వైద్య విద్యార్థులపై సస్పెన్షన్ వేటుపడింది. ఎంబీబీఎస్ పూర్తి చేసి ఇంటర్న్‌షిప్ చేస్తున్న కీలక సమయంలో వేసిన తప్పటడుగు వారి భవిష్యత్‌ను ప్రమాదంలోకి నెట్టింది. వారు కేసులను ఎదుర్కోబోతున్నారు.

భవిష్యత్‌పై ర్యాగింగ్ దెబ్బ

ఇంటర్న్‌షిప్ నుంచి ఐదుగురు మెడికోల సస్పెన్షన్

- హాస్టల్ నుంచి పర్మినెంట్‌గా టర్మినెట్
- యాంటీ ర్యాగింగ్ కమిటీ తీర్మానం
- కేసులు ఎదుర్కోనున్న వైద్య విద్యార్థులు
- ఆ తరువాతే ఎన్ఎంసీ నిర్ణయం

నిజామాబాద్ నాగారం: వైద్యులుగా సమాజానికి సేవలందించాల్సిన వారు ర్యాగింగ్ కేసులో ఇరుక్కుని తమ భవిష్యత్‌ను ప్రమాదంలో పడేసుకున్నారు. రిజిస్టర్‌లో జూనియర్ హాజరును మార్చి.. ఆ తరువాత సదరు మెడికోను ర్యాగింగ్ చేయడంతోపాటు దాడికి పాల్పడిన ఐదుగురు ఇంటర్న్‌షిప్ వైద్య విద్యార్థులు సాయిరాం పవన్, శ్రావణ్, సాత్విక్ హృదయ పాల్, అభినవ్ పెద్ది, ఆదిత్యపై సస్పెన్షన్ వేటు పడింది. ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఎంబీబీఎస్ పట్టా అందుకోవాల్సిన వారు కేసులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల చరిత్రలో మొదటిసారి ర్యాగింగ్ జరగగా, ఈ ఘటనపై విచారణ కమిటీ అధికారులు సీరియస్‌గా స్పందించారు.

బాధిత విద్యార్థి ఫిర్యాదుతోనే..

జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో సీనియర్ల, జూనియర్ల మధ్య చోటు చేసుకున్న ఘటనను అంతా రెండు గ్రూపుల మధ్య గొడవగానే భావించారు. అయితే ఎంబీబీస్ నాలుగో సంవత్సరం చదువుతున్న బాధిత విద్యార్థి రాహుల్‌రెడ్డి తనను సీనియర్లు ర్యాగింగ్ చేయడంతోపాటు దాడి చేశారని సోషల్ మీడియా ద్వారా బయటకు చెప్పడంతో ఈ ఘటన వెలుగుచూసింది. ఆ తరువాత బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అప్పటి వరకు సంబంధిత అధికారులు రెండు గ్రూపుల మధ్య గొడవ అని బుకాయించే ప్రయత్నం చేశారు. కళాశాల, జీజీహెచ్ పరువుపోతుందనే అధికారులు విషయాన్ని బయటికి పొక్కనీయలేదు.

సస్పెండ్.. టర్మినెట్

ఐదుగురు ఎంబీబీఎస్ ఇంటర్న్‌షిప్ విద్యార్థులు తమ తప్పును ఒప్పుకోవడంతో యాంటీ ర్యాగింగ్ కమిటీ వారిని ఆరు నెలలపాటు సస్పెండ్ చేసింది. అలాగే హాస్టల్ నుంచి పర్మినెంట్‌గా టర్మినేట్ చేసింది. ఇంటర్న్‌షిప్ మధ్యలో ఆగిపోవడం, ఎంబీబీఎస్ పట్టా చేతికి అందడంలో ఆలస్యం వైద్య విద్యార్థులు భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం చూపనుంది. ఆరు నెలల తరువాత ఈ ఘటనపై రివ్యూ చేసిన తరువాత ఎన్ఎంసీ(నేషనల్ మెడికల్ కౌన్సిల్) గైడ్‌లైన్స్ ప్రకారం అప్పుడే నిర్ణయం తీసుకోనున్నారు.

రోజంతా విచారణ

యాంటీ ర్యాగింగ్ కమిటీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ చాంబర్‌లో సోమవారం విచారణ చేపట్టింది. కన్వీనర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణమోహన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్‌లు నాగమోహన్, జలగం తిరుపతిరావు, కిశోర్, అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాములు, ఆయా విభాగాల హెచ్‌వోడీలును కలుపుకుని మొత్తం 18 మందితో కలిసి కమిటీ ఏర్పాటు చేసి చర్చించారు. అడిషనల్ కలెక్టర్ అంకిత్, డీసీపీ బస్వారెడ్డి హాజరై ప్రత్యేకంగా సమీక్షించారు. ముందుగా బాధిత విద్యార్థితోపాటు అతడి తల్లిదండ్రులను విచారించారు. అనంతరం ర్యాగింగ్, దాడికి పాల్పడిన సీనియర్లను ఒక్కొక్కరిని పిలిపించి ప్రశ్నించారు. ఘట నలో ఎవరి పాత్ర ఎంత వరకు ఉందని తెలుసుకున్నారు. ఆవేశంలో చేశామని, తప్పు జరిగిందని, క్షమించాలని ఐదుగురు సీనియర్లు కమిటీ ముందు విన్నవించుకున్నట్లు తెలిసింది.

మెరిట్ మాయాజాలం

- వైద్యారోగ్యశాఖలో ఇష్టారాజ్యంగా కాంట్రాక్ట్ నర్సుల ఎంపిక
- 1:2 విధానంలో 60 మందితో జాబితా.. రెండుసార్లు 13 మంది అభ్యర్థుల పేర్లు
- నేడు ఆర్డర్ కాపీలు ఇచ్చేందుకు ప్లాన్
- కొవిడ్ సమయంలో సేవలందించిన వారిని పట్టించుకోని వైనం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: వైద్యారోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ కింద పని చేయాల్సిన కాంట్రాక్ట్ నర్సుల ఎంపిక ప్రక్రియ ఇష్టారాజ్యంగా చేపడుతున్నారు. మెరిట్ జాబితాలో మాయాజాలం చేసిన అధికారులు.. మంగళవారం రోజున చడీచప్పుడు కాకుండా ఆర్డర్ కాపీలు ఇచ్చేందుకు ప్లాన్ చేసుకోవడంతో అభ్యర్థులు లబోదిబోమంటున్నారు. ఏడాదిన్న క్రితం దరఖాస్తు చేసుకున్న వందలా ది మంది అభ్యర్థుల విషయంలో ఏమాత్రం పట్టింపు లేకుండా వ్యవహరించారు. 30 కాంట్రాక్ట్ నర్సు పోస్టుల కోసం వందల మంది దరఖాస్తు చేసుకుని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులతోపాటు రాష్ట్ర కమిషనరేట్ అధికారుల చుట్టూ తిరుగుతూ వచ్చారు. చివరకు చేపట్టిన నియామక ప్రక్రియపై పలువురు అభ్యర్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోస్టుల భర్తీ కోసం 1:2 పద్ధతిలో 60 మందితో జా బితా విడుదల చేయగా, ఇందులో చిత్రవిచిత్రాలు చోటుచేసుకున్నాయి. జాబితాలో 60 పేర్లు ప్రకటించగా ఇందులో 13 మంది పేర్లు రెండుసార్లు రా వడం గమనార్హం. పైగా ఒకరి మెరిట్ వద్ద మరొకరి పేరు వచ్చినట్లు అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోస్టర్ సక్రమంగా పాటించకపోగా మెరిట్ తక్కువ ఉన్నవారికి జాబితాలో చోటు కల్పించి ఎక్కువ మెరిట్ ఉన్న తమకు ఇవ్వలేదని పలువురు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై అభ్యర్థులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా రు. అభ్యంతరాలు నమోదు చేయాలని కలెక్టర్ చెప్పారని, మంగళవారమే ఆర్డర్లు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసిన నేపథ్యంలో అభ్యంతరాలు దాఖలు చేసే పరిస్థితి ఎక్కడిదని అభ్యర్థులంటున్నారు. కలెక్టర్ దృష్టికి ఫిర్యాదులు వెళ్లడంతో.. వైద్యారోగ్యశాఖ అధికారులు మాత్రం కంప్యూటర్ తప్పిదమంటూ చేతులు దులుపుకోవడం గమనార్హం. ఇది లా ఉండగా కొవిడ్ సమయంలో సేవలందించినవారికి నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని నేషనల్ హెల్త్ మిషన్ చెప్పినప్పటికీ ఏ మాత్రం పరిగణలోకి తీసుకోకపోవడం శోచనీయం. మెరిట్ జాబిత, నేషనల్ హెల్త్ మిషన్ సూచనల బేఖాతరుపై డీఎంహెచ్‌వో రాజశ్రీని వివరణ కోరేందుకు 'సాక్షి' సంప్రదించగా ఆమె స్పందించలేదు.

ప్రాధాన్యత ఇవ్వడం లేదు

ఏడాదిన్న క్రితం దరఖాస్తు చేసుకుని నియమాకాల కోసం అనేకసార్లు జిల్లా వైద్యారోగ్య శాఖ, రాష్ట్ర ఉన్నతాధికారుల చుట్టూ తిరిగాం. ప్రతిసారి మూడు నెలల్లో భర్తీ చేస్తామని చెబుతూ వచ్చారు. హైదరాబాద్‌లో డీఎంఈ వద్ద ధర్నా చేశాం. ఎన్‌హెచ్ఎంకు సైతం వెళ్లాం. మెరిట్ మేరకు భర్తీ చేస్తామని చెప్పి ఇవ్వడం లేదు. మెరిట్ లేనివారిని తీసుకుంటున్నారు. ఇక కొవిడ్ కాలంలో సేవలందించినవారికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎన్‌హెచ్ఎం చెప్పినప్పటికీ పట్టించుకోలేదు. – సల్మా, ఆర్మూర్

నిజాంసాగర్ రెండు గేట్ల ఎత్తివేత

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 15,482 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో సోమవారం రెండు గేట్లను ఎత్తి అంతే నీటిని మంజీర నదిలోకి నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1,404.57 అడుగుల (17.181 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.



ప్రాజెక్టు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి

నిజామాబాద్‌అర్బన్: ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించే విధుల్లో ప్రతిరోజూ నిమగ్నమై ఉండే పారిశుద్ధ్య కార్మికుల భద్రత, సంక్షేమానికి ప్రాధ్యాన్యత ఇవ్వాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. కలెక్టరేట్ సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన సోమవారం మాన్యువ ల్ స్కావెంజర్స్ సర్వే కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయా శాఖల ద్వారా పారిశుద్ధ్య కార్మికు ల కోసం అమలవుతున్న సంక్షేమ పథకాలు, వాటి ప్రయోజనాలపై సమీక్షించారు.

జిల్లాలో ఎక్కడ కూడా మాన్యువల్ స్కావెంజర్స్ లేరని, 1993 నిషేధ చట్టం పకడ్బందీగా అమలవుతోందని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి రజిత వివరించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా లోని నిజామాబాద్ నగరపాలక సంస్థ, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీలతోపాటు 545 గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటి చెత్తను సేకరించి, వాహనాల ద్వా రా డంప్ యార్డులకు తరలిస్తున్నారన్నారు. ప్రమాదవశాత్తు పారిశుద్ధ్య కార్మికులు మరణిస్తే బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందేలా చొరవ చూపాలన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, బీమా, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు వర్తించేలా చూడాలన్నారు. సఫాయి కర్మచారీలందరూ ఆన్‌లైన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ రవిబాబు, సీపీవో రతన్, ఆయా శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

బీజేపీతోనే బంగారు, ప్రజాస్వామ్య తెలంగాణ

- రైతుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు..
- అర్వింద్ కృషితోనే పసుపు బోర్డు ఏర్పాటు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు
- జిల్లా బూత్‌స్థాయి సభ్యుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు, ఎంపీ అర్వింద్, ఎమ్మెల్సీలు

సుభాష్‌నగర్: బీజేపీతోనే బంగారు, ప్రజాస్వామ్య తెలంగాణ సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు అన్నారు. అన్ని పార్టీల నుంచి నాయకులు, ప్రజాప్రతినిధులు బీజేపీ వైపు చూస్తున్నారని, ప్రజలు రాజకీయ మార్పు కోరుకుంటున్నారన్నారు. బూత్‌స్థాయి సభ్యుల ఆత్మీయ సమ్మేళనాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని శ్రీరామాగార్డెన్‌లో సోమవారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఇందల్వాయి టోల్‌ప్లాజా నుంచి కార్లతో భారీ ర్యాలీగా నగరానికి చేరుకున్నారు. ఆత్మీయ సమ్మేళనంలో రాంచందర్‌రావు మాట్లాడుతూ.. జిల్లాతో తనకు పార్టీపరంగా అనుబంధం ఉందని, అలాగే కుటుంబపరంగా సంబంధాలు ఉన్నాయన్నారు. ఎంపీ అర్వింద్ కృషితో పసుపు బోర్డు ఏర్పాటైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెబుతూ, విద్యార్థులు, రైతులు, నిరుద్యోగులను మోసం చేస్తోందని విమర్శించారు. 19 నెలల్లో కేవలం 73 ఇందిరమ్మ ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయన్నారు. రైతుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదన్నారు. స్థానిక సంస్థలను బీఆర్ఎస్, కాంగ్రెస్ నిర్వీర్యం చేశాయని, నిధులు దారి మళ్లించాయని ఆరోపించారు. త్వరలోనే రాజకీయ మార్పు జరుగుతుందని రాంచందర్‌రావు పేర్కొన్నారు. బోధన్ నియోజకవర్గానికి చెందిన పలువురు పార్టీలో చేరగా రాంచందర్‌రావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ బలంగా ఉందన్నారు. జెడ్పీ చైర్మన్ పదవిని పార్టీ రాష్ట్ర నాయకత్వానికి కానుకగా ఇస్తామని ప్రకటించారు. నిజామాబాద్ కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగురవేస్తామని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆశాభావం వ్యక్తంచేశారు.

ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, చిన్నమైల్ అంజిరెడ్డి, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, జగిత్యాల్ అధ్యక్షుడు డాక్టర్ యాదగిరిబాబు, సీనియర్ నాయకులు లోక భూపతిరెడ్డి, టక్కర్ హన్మంత్ రెడ్డి, పెద్దోళ్ల గంగారెడ్డి, మోరెపల్లి సత్యనారాయణ, నర్సింహారెడ్డి, బస్వా లక్ష్మీనర్సయ్య మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, బోగ శ్రావణి, గోపిడి స్రవంతిరెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, పంచరెడ్డి ప్రవళిక, తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో ప్రీ ప్రైమరీ విద్య



మోర్తాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల భవనం

- జిల్లాలో 48 పాఠశాలల గుర్తింపు
- నాలుగేళ్లలోపు చిన్నారులకు ప్రత్యేక అడ్మిషన్లు
- ఇన్‌స్ట్రక్టర్, ఆయాల నియామకానికి నోటిఫికేషన్ జారీ

మోర్తాడ్(బాల్కొండ):సర్కారు బడులను బలోపేతం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.ప్రాథమిక పాఠశాలల్లో చేరికలు తగ్గుతుండడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది.నాలుగేళ్లలోపు వయస్సు ఉన్న చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందించేందుకు విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది.ఎంపిక చేసిన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ విద్యను అమలు చేసేందుకు విద్యాశాఖ కార్యదర్శి ఇప్పటికే మార్గదర్శకాలను జారీచేశారు.అందులో భాగంగా జిల్లాలో 48 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ అమలు చేయనున్నారు.

త్వరలోనే నియామకాలు

అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే చిన్నారులతోపాటు ప్రైవేటు పాఠశాలల్లో నర్సరీ,ఎల్‌కేజీ, యూకేజీ చదువుకునే చిన్నారులకు ప్రీ ప్రైమరీ విద్యను అందించనున్నారు. ప్రీ ప్రైమరీ విద్య అమలుకు ఎంపికైన పాఠశాలల్లో ఒక ఇన్‌స్ట్రక్టర్, ఆయాను నియమించనున్నారు.చదువు చెప్పేవారికి ఇంటర్ అంతకు మించి విద్యార్హత ఉండాల్సి ఉంది. ఆయాలు కనీ సం ఏడో తరగతి చదువుకొని ఉండాలి. ఇన్‌స్ట్రక్టర్‌లకు నెలకు రూ.8వేలు, ఆయాలకు రూ.6వేల చొ ప్పున వేతనం చెల్లించనున్నారు.వీరి నియామకాని కి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రీప్రైమరీ వి ద్యలో భాగంగా పిల్లలకు మధ్యాహ్న భోజనం అందించడంతోపాటు ఆటాపాటలతో కూడిన చదువు నేర్పించనున్నారు. ఎంఈవోలు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు ప్రీ ప్రైమరీ విద్యను అందించే చోట అజమాయిషీ చేయనున్నారు. ప్రీప్రైమరీ విద్య అందించేందుకు నియామకాలను త్వరలోనే పూర్తి చేస్తామని మోర్తాడ్ ఎంఈవో సమ్మిరెడ్డి అన్నారు. ఇన్‌స్ట్రక్టర్, ఆయాల నియామకానికి నోటిఫికేషన్ జారీచేశామని షెడ్యూల్ ప్రకారం ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ అమలు చేస్తామన్నారు.

ప్రీ ప్రైమరీ విద్యకు ఎంపిక చేసిన పాఠశాలలు

స్కూల్	గ్రామం				
ఎంపీపీఎస్	ఇందల్వాయి	ఎంపీపీఎస్	శ్రీనగర్ క్యాంపు	ఎంపీపీఎస్	నిజాంపూర్
ఎంపీయూపీఎస్	అక్లూర్	ఎంపీపీఎస్	లక్ష్మీఫాం	ఎంపీపీఎస్	ఒంటిప్ప తాండా
ఎంపీపీఎస్	కొత్తపల్లి	ఎంపీపీఎస్	మహంతం	ఎంపీపీఎస్	హనుమాన్‌ఫాం
ఎంపీయూపీఎస్	హమ్నాపూర్	ఎంపీపీఎస్	ముప్కాల్	ఎంపీపీఎస్	రాంపూర్
ఎంపీపీఎస్	బడా భీమ్‌గల్	ఎంపీపీఎస్	వెంచిర్యాల్	ఎంపీయూపీఎస్	చిక్లీ
ఎంపీపీఎస్	దేగాం	ఎంపీపీఎస్	మావందికలాన్	ఎంపీయూపీఎస్	కొత్తపల్లి
ఎంపీపీఎస్	రాణాకలాన్	ఎంపీపీఎస్	అమీర్ అలీనగర్	ఎంపీపీఎస్	అల్జాపూర్
ఎంపీయూపీఎస్	బొప్పాపూర్	ఎంపీపీఎస్	కేశాపూర్	ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల	హెచ్‌డబ్ల్యూ
ఎంపీపీఎస్	వద్యాట్‌పల్లి	ఎంపీయూపీఎస్	యంచ	ఎంపీపీఎస్	మెట్‌పల్లి
ఎంపీపీఎస్	జాకోరా	ఎంపీపీఎస్	ఏఆర్‌ఆర్ క్యాంపు(ఉర్దూ)	ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల	ఆటోనగర్ (ఉర్దూ)
ఎంపీపీఎస్	పోచంపల్లి	ఎంపీపీఎస్	కందకుర్తి	ఎంపీపీఎస్	మిట్టాపల్లి
ఎంపీపీఎస్	పోచారం	ఎంపీయూపీఎస్	సాటాపూర్ (ఉర్దూ)	ఎంపీపీఎస్	ఏర్గట్ల (ఉర్దూ)
ఎంపీయూపీఎస్	పెంటాకలాన్	ఎంపీపీఎస్	బాగేపల్లి	జడ్పీహెచ్ఎస్	తాటిపల్లి
ఎంపీపీఎస్	పుప్పాలపల్లి	ఎంపీపీఎస్	ఆలూర్	ఎంపీపీఎస్	యూఎన్ తాండా
ఎంపీపీఎస్	ముత్యకుంట	ఎంపీపీఎస్	ఉమ్మెడ	ఎంపీపీఎస్	వాల్గోట్ కలాన్(ఉర్దూ)
ఎంపీపీఎస్	ఎత్తొండ	ఎంపీపీఎస్	ఎస్సీ, బీసీ కాలనీమోర్తాడ్		
		ఎంపీపీఎస్	కళ్యాపూర్		

క్లుప్తంగా

ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన కొనసాగాలి

● రిటైర్డ్‌ జడ్జి హేమంత్‌కుమార్‌



తెయూ(డిచ్‌పల్లి): అధికారం, ధనం, బంధుప్రీతికి అతీతంగా ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన కొనసాగాలని చట్టాలు సూచిస్తున్నాయని హైదరాబాద్‌ జిల్లా రిటైర్డ్‌ జడ్జి డాక్టర్‌ డి.హేమంత్‌కుమార్‌ పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ న్యాయ కళాశాలలో సోమవారం 'చట్టాల విశ్లేషణ – వివేచన' అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన రిసోర్స్‌ పర్సన్‌గా హాజరై ప్రసంగించారు. సమాజంలో పెడధోరణులు పెరగకుండా చట్టాలు సహజ సూత్రాలను అందిస్తాయన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం కుల, మత, వర్గ, వర్ణ తేడా లేకుండా చట్టం దృష్టిలో అందరూ సమానమని తెలిపారు. అనంతరం న్యాయ విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు వివరణాత్మకంగా సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపల్‌ కే ప్రసన్న రాణి, బీవోఎస్‌ చైర్మన్‌ బీ స్రవంతి, న్యాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

లేబర్‌కార్డులు తీసుకోవాలి

● అసిస్టెంట్‌ లేబర్‌ కమిషనర్‌ నరేందర్‌రాజు



నిజామాబాద్‌నాగారం: జిల్లాలో ఎలక్ట్రీషియన్‌ పనులు చేస్తున్న ప్రతి ఒక్కరూ కచ్చితంగా లేబర్‌కార్డులు తీసుకోవాలని అసిస్టెంట్‌ లేబర్‌ కమిషనర్‌ నరేందర్‌రాజు తెలిపారు. నగరంలోని గవర్నమెంట్‌, ప్రైవేటు ఎలక్ట్రికల్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు వైసాక్షి సంతోష్‌ ఆధ్వర్యంలో సోమవారం లేబర్‌ కార్డులపై అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే కార్డులతో ఇన్సూరెన్స్‌, ఆర్థికసాయం అందుతుందన్నారు. కార్డు ఐదేళ్లకోసారి రెన్యువల్‌ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎలక్ట్రీషియన్స్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ సలీం, టౌన్‌ ప్రెసిడెంట్‌ రమేశ్‌, అజీమ్‌ అత్తర్‌ ఖాన్‌, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

పీజీ, బీఈడీ పరీక్షల్లో 90 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఏర్పాటు చేసిన 7 పరీక్ష కేంద్రాల్లో కొనసాగుతున్న పీజీ, బీఈడీ, బీపీఎడ్‌ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షల్లో సోమవారం 90 మంది విద్యా ర్థులు గైర్హాజరైనట్లు ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. ఉదయం జరిగిన పీజీ, ఇంటిగ్రేటెడ్‌ పీజీ 2,4వ సెమిస్టర్‌ పరీక్షలకు 1504 మంది విద్యార్థులకు 1438 మంది హాజరు కాగా 66 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన బీఈడీ, బీపీఎడ్‌ పరీక్షలకు 489 మంది విద్యార్థులకు గానూ 465 మంది హాజరుకాగా 24 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

ప్రజావాణికి 102 ఫిర్యాదులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్‌ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్‌: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 102 ఫిర్యాదులు అందాయి.

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్‌ కిరణ్‌ కుమార్‌, ట్రెయినీ కలెక్టర్‌ కరోలిన్‌ చింగ్తియాన్‌ మావీ, హౌసింగ్‌ పీడీ పవన్‌ కుమార్‌, నిజామాబాద్‌ ఏసీపీ రాజా వెంకట్‌ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిష్కరించాలని కలెక్టర్‌ అధికారులకు సూచించారు.

ర్యాగింగ్‌ను అరికట్టాలి

ర్యాగింగ్‌ను అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కరక గణేశ్‌ అదనపు కలెక్టర్‌ కిరణ్‌ కుమార్‌కు విన్నవించారు. మెడికల్‌ కళాశాలలో ర్యాగింగ్‌తో మెడికో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇలాంటి విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు.

వేధిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోండి



నవీపేట మండలం అల్జాపూర్‌ గ్రామానికి చెందిన సంతోష్‌ అదే గ్రామానికి చెందిన ఓ మహిళను శారీరకంగా వేధించి అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వెంటనే అతనిపై చర్య తీసుకోవాలని ఎమ్మార్పీఎస్‌ నిజామాబాద్‌ అర్బన్‌ అధ్యక్షుడు సుధాకర్‌ ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అల్జాపూర్‌ గ్రామానికి చెందిన మహిళను బెదిరించి లొంగదీసుకుని శారీరకంగా వేధించాడని, అనంతరం వీడియోలు, ఫొటోలు బయట పెడతానంటూ బెదిరిస్తున్నాడని పేర్కొన్నారు. సంతోష్‌పై నవీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. సంతోష్‌తో సదరు మహిళకు ప్రాణహాని ఉందని, వెంటనే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

సంక్షేమ వసతిగృహాల సమస్యలు పరిష్కరించాలి



సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకులు అదనపు కలెక్టర్‌ కిరణ్‌ కుమార్‌కు విన్నవించారు. ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు మరమ్మతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తగిన నిధులను కేటాయించి మరమ్మతులు చేయించాలన్నారు.

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్‌ బీ, చిన్నారుల ప్రతిభకు పట్టం

సాక్షి మీడియా గ్రూప్‌ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాఠశాలల వారీగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్స్‌ చివరి తేదీ సెప్టెంబర్‌ 10, 2025

కేటగిరీ-1లో 1,2 తరగతులు, కేటగిరీ-2లో 3,4 తరగతులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల వారికి. కేటగిరీల వారీగా బహుమతులతో పాటు చాంపియన్‌ స్కూల్‌ ట్రోఫీ, విజేతలకు మెడల్స్‌, పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్‌ సర్టిఫికెట్లు అందజేస్తారు.





సాక్షి స్పెల్‌బీకి నాలుగు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రౌండ్‌ పాఠశాల ద్వారా రిజిస్టర్‌ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలోనే జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌ (క్వార్టర్‌ ఫైనల్స్‌) మూడో రౌండ్‌ (సెమీ ఫైనల్స్‌) నాలుగో రౌండ్‌ ఫైనల్స్‌ మౌఖిక పరీక్ష జరుగుతాయి.

సాక్షి మ్యాథ్‌ బీకి మూడు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రెండు రౌండ్లు పాఠశాల ద్వారా రిజిస్టర్‌ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలో జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌లో సెమీ ఫైనల్స్‌, మూడో రౌండ్‌ ఫైనల్స్‌ మౌఖిక పరీక్ష జరుగుతాయి. మొదటి రౌండ్‌ తప్ప మిగతా రౌండ్స్‌ సాక్షి నిర్ణయించిన వేదికల్లో జరుగుతాయి.

విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు | రిజిస్ట్రేషన్‌ ఫీజు రూ. 250, మరిన్ని వివరాల కోసం.. (ఉ.10 గం.ల నుంచి సా. 6 గం.ల మధ్య సంప్రదించగలరు)

www.arenaoneschoolfest.com వెబ్‌సైట్లో సంప్రదించవచ్చు.
040- 23256134 / 9505551099 / 9705199924 కు కాల్‌ చేయవచ్చు.

1న కలెక్టరేట్‌ ఎదుట నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవోస్‌ జిల్లా అధ్యక్షుడు సుమన్‌

నిజామాబాద్‌అర్బన్‌: సెప్టెంబర్‌ 1న పెన్షన్‌ విద్రోహ దినంగా భావిస్తూ కలెక్టర్‌ కార్యాలయం ఎదుట ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపడతామని టీఎన్జీవోస్‌ జిల్లా అధ్యక్షుడు సుమన్‌ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరసన అనంతరం సీపీఎస్‌ రద్దు కోసం రాష్ట్ర ఎంప్లాయీస్‌ జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి తరలిరావాలన్నారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం చేపట్టనున్న బస్సు యాత్ర సెప్టెంబర్‌ 11న జిల్లా కేంద్రానికి వస్తుందని పేర్కొన్నారు. యాత్రను విజయవంతం చేయాలని తెలిపారు. సమావేశంలో టీఎన్జీవోస్‌ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌, అర్బన్‌ యూనిట్‌ అధ్యక్షుడు జాకీ హుస్సేన్‌, ఆర్మూర్‌ యూనిట్‌ అధ్యక్షుడు శశికాంత్‌ రెడ్డి, సూర్య ప్రకాశ్‌, సాయి కృష్ణ, జ్ఞానేశ్వర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌ డ్రైవ్‌లో 115 మందికి ఉద్యోగాలు



నిజామాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలోని ఉమెన్స్‌ కళాశాలలో మ్యాజిక్‌ బస్‌, సిస్కో ఆధ్వర్యంలో సోమవారం మెగా జాబ్‌ డ్రైవ్‌ నిర్వహించారు. జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన 222 మంది విద్యార్థులు డ్రైవ్‌లో పాల్గొనగా, 115 మంది ఉద్యోగాలు సాధించారు. ఉమెన్స్‌ కళాశాలకు చెందిన 25మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారు. మెగా జాబ్‌ డ్రైవ్‌లో యాక్సిస్‌ బ్యాంక్‌, ఫిన్విచ్‌, టెక్‌ మహీంద్రా కంపెనీలతోపాటు ఇతర 14 సంస్థలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్‌ భారతి రెడ్డి, కళాశాల ట్రెయినింగ్‌ కంప్లేస్‌మెంట్‌ అధికారి ప్రసాద్‌, మహేశ్‌, ఉమెన్స్‌ ఎడ్యుకేషనల్‌ సొసైటీ అధ్యక్షుడు రాజేందర్‌, కరస్పాండెంట్‌ కిషన్‌ రెడ్డి, జయంతి, సెక్రెటరీ పద్మనాభరెడ్డి, కోశాధికారి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమగ్రతకు పాటుపడాలి

● పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి
● రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఎం.యాదగిరి



ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్ల నుద్దేశించి మాట్లాడుతున్న తెయూ రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్‌) ద్వారా వలంటీర్లు జాతీయ సమగ్రతకు పాటుపడాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఎం.యాదగిరి సూచించారు. తెయూ ఎన్‌ఎస్‌ఎస్‌ ఆధ్వర్యంలో సోమవారం ప్రీ రిపబ్లిక్‌ పరేడ్‌ ఎంపికలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్‌ యాదగిరి మాట్లాడుతూ.. ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు సమాజ సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలని సూచించారు. ప్రతి వలంటీర్‌ ప్రీ పరేడ్‌ ఎంపికకు పోటీ పడాలని, పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర ఎన్‌ఎస్‌ఎస్‌ యువజన అధికారి సైదా నాయక్‌ పర్యవేక్షణలో విద్యార్థుల ఎత్తు, పరుగు పందెం, పరేడ్‌, కల్చరల్‌ కార్యక్రమాలు, వ్యక్తిగత నైపుణ్యాన్ని పరీక్షించారు. కార్యక్రమంలో తెయూ ఎన్‌ఎస్‌ఎస్‌ కో-ఆర్డినేటర్‌ ప్రొఫెసర్‌ కే రవీందర్‌రెడ్డి, ప్రోగ్రాం అధికారులు స్వప్న, సంపత్‌, ప్రవంతి, అలీంఖాన్‌, అంజయ్య, ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సొంతగూటికి విజయభారతి

● కేటీఆర్‌ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిక



కేటీఆర్‌ సమక్షంలో బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరుతున్న విజయ భారతి

ఆర్మూర్‌: నియోజకవర్గ పరిధిలోని ఆలూర్‌ మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకురాలు విజయభారతి హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఆర్మూర్‌ మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్‌ రెడ్డి ఆధ్వర్యంలో ఆలూర్‌ నుంచి వాహనాల్లో ర్యాలీగా హైదరాబాద్‌కు వెళ్లి బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు. బీజేపీ సీనియర్‌ నాయకుడు ఆలూర్‌ గంగారెడ్డి కూతురు విజయభారతి సొంతగూటికి చేరుకున్నట్లు కేటీఆర్‌ ఈ సందర్భంగా పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిక కార్యక్రమంలో మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డి, ఆయుష్య, జెడ్పీ మాజీ చైర్మన్‌ దాదన్న గారి విఠల్‌రావు, అరవింద్‌ రెడ్డి, మాజీ వైస్‌ ఎంపీపీ మోతె చిన్నారెడ్డి, మోహన్‌ రెడ్డి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్‌ వ్యవసాయం

● ప్రత్యేక ఛానల్‌ను ప్రారంభించిన వ్యవసాయశాఖ
● రైతులకు వ్యవసాయ సమాచారం

కమ్మర్‌పల్లి: సాంకేతిక పరిజ్ఞానంతో ఏ సమాచారమైన క్షణాల్లో ప్రజలకు చేరువవుతున్న ప్రస్తుత కాలంలో.. వ్యవసాయశాఖ సైతం టెక్నాలజీని రైతుల కోసం వినియోగించుకుంటోంది. ప్రభుత్వ పథకాలు, వాతావరణ సూచనలు, సాగు పద్ధతులు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు తదితర వ్యవసాయ సమాచారాన్ని రైతులకు అందించేందుకు ప్రత్యేకంగా వాట్సాప్‌ ఛానల్‌ను ఇటీవలే ప్రారంభించింది. పంటల సాగులో ఎదురయ్యే సమస్యలు, సీజన్ల వారీగా పంటలను ఆశించే తెగుళ్లు, వాటి నివారణ, వాతావరణ సూచనలు తదితర సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేందుకు వీలుగా వ్యవసాయ శాఖ వాట్సాప్‌ ఛానల్‌ను అందుబాటులోకి తెచ్చింది. పంటల సాగులో తమకు ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారాన్ని రైతులు వాట్సాప్‌ ఛానల్‌ ద్వారా తెలుసుకోవచ్చు.

మొదటి విడతలో అధికారులు, శాస్త్రవేత్తలు


వ్యవసాయ శాఖ ప్రారంభించిన వాట్సాప్‌ ఛానల్లో తొలివిడతలో అధికారులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక ప్రజ్ఞావంతులను చేర్చారు. తాజాగా ఆ గ్రూపులో రైతులను చేర్చాలని ఆదేశాలు రావడంతో ఆసక్తి గల రైతులను నమోదు చేస్తున్నారు. ఆండ్రాయిడ్‌ ఫోన్‌ ఉన్న ప్రతి రైతు వాట్సాప్‌ ఛానల్లో చేరే వీలుంది. విత్తన దశ నుంచి పంట చేతికి వచ్చే వరకు పంటల సమాచారం రైతులకు చేరుతుంది. తెలుగులో సమాచారం ఉండటంతో కొద్దిగా చదివే పరిజ్ఞానం ఉన్నా సరిపోతుంది. వాట్సాప్‌ ఛానల్‌ ద్వారా అధికారిక సమాచారం అందుబాటులో ఉంటుంది. తెగుళ్లను ఫొటోలతో సహా తెలియజేయడంతోపాటు వాటి లక్షణాలు, నివారణ మందులు తదితర వాటిని సూచిస్తున్నారు. జిల్లాలో ఆసక్తి గల రైతులు వాట్సాప్‌ ఛానల్‌లో చేరాలనుకుంటే సంబంధిత ఏఈవోలు లేదా వ్యవసాయాధికారులను సంప్రదించాల్సి ఉంటుంది.



వ్యవసాయ శాఖ వాట్సాప్‌ ఛానల్‌

ఎస్సారెస్పీ నీటి విడుదల నిలిపివేత

● 29,907 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
● కాలువల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల



ప్రాజెక్ట్‌ వద్ద మూసి వేసిన వరద గేట్లు



వరద గేట్ల ముందు చేపలు పడుతున్న జాలరి

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదలను ప్రాజెక్ట్‌ అధికారులు సోమవారం మధ్యాహ్నం నిలిపివేశారు. ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్ట్‌లోకి భారీ వరదలు రావడంతో గత సోమవారం నుంచి 25 వేల క్యూసెక్కుల నీటి విడుదలను ప్రారంభించారు. గరిష్టంగా 3.75 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. ప్రాజెక్ట్‌లోకి ఆదివారం రాత్రి ఇన్‌ఫ్లో తగ్గడంతో గోదావరిలోకి నీటి విడుదలను క్రమంగా తగ్గించారు. చివరికి 2 గేట్ల ద్వారా 6 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. సోమవారం మధ్యాహ్నానికి పూర్తిగా గేట్లు మూసివేశారు.

కొనసాగుతున్న వరద నీరు

ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతాల నుంచి 29,907 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. సోమవారం 37వేల క్యూసెక్కులకు తగ్గిన వరద, మధ్యాహ్నానికి 29,907 క్యూసెక్కులకు పడిపోయింది. ప్రాజెక్ట్‌ నుంచి వరద కాలువ ద్వారా 20 వేల క్యూసెక్కులు, ఎస్కేప్‌ గేట్ల ద్వారా 4500 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 3500, సరస్వతి కాలువకు 500, లక్ష్మి కాలువకు 150, మిషన్‌ భగీరథకు 231 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. 651 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో పోతుంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌ 1090.90(80.05 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

ఏటికి ఎదురీదుతున్న మత్స్యకారులు

ఎస్సారెస్పీ నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల తగ్గుముఖం పట్టడంతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్తున్నారు. చేపల కోసం మత్స్యకారులు నీటితో సహవాసం చేస్తున్నారు. ప్రాజెక్ట్‌ వరద గేట్ల ముందర తెప్పలపై వెళుతూ, బండరాళ్లపై నిలబడి చేపలు పడుతున్నారు. మరోవైపు గోదావరిలోకి నీటి విడుదల చేసే సమయంలో చేపలు, చేప పిల్లలు కొట్టుకుపోతున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు వరద గేట్లకు జాలీ గేట్లు ఉంటే చేప పిల్లలు గంగపాలయ్యేవి కావని అభిప్రాయపడుతున్నారు. కాగా, వరద గేట్లకు జాలి గేట్లు పెట్టే పరిస్థితి ఉండదని ప్రాజెక్ట్‌ అధికారులు చెబుతున్నారు.

క్రైం కార్నర్‌

తాళం వేసిన ఇంట్లో చోరీ

రుద్రూర్‌: తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడిన ఘటన పోతంగల్‌ మండల కేంద్రంలో జరిగింది. కోటగిరి ఎస్సై సునీల్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోతంగల్‌ గ్రామానికి చెందిన మొండి రాములు ఆదివారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉంది. బీరువాలోని రెండున్నర తులాల బంగారం, 38 తులాల వెండి ఆభరణాలు దుండగులు అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని శ్రద్ధానంద్‌ గంజ్‌లో సోమవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి (35) ఉరేసుకొని మృతి చెందినట్లు మూడో టౌన్‌ ఎస్సై హరిబాబు తెలిపారు. మృతుడి ఒంటిపై బ్లూ రంగు టీ షర్టు, నేవీ బ్లూ రంగు ప్యాంట్‌ ఉందని పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లభించలేవని, మృతదేహాన్ని జీజీహెచ్‌లోని మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే మూడో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

డ్రెయినేజీలో పడి ఒకరు..



బాన్సువాడ రూరల్‌: మండల కేంద్రంలోని డబుల్‌ బెడ్రూం కాలనీలో నివాసముండే గులాం జిలానీ(50) ప్రమాదవశాత్తు తాడ్కోల్‌ శివారులోని బీడీ వర్కర్స్‌ కాలనీలోని డ్రెయినేజీలో పడి మృతి చెందాడు. బాన్సువాడలోని ఓ హోటల్‌లో పనిచేసే జిలానీ శుక్రవారం రాత్రి పని ముగించుకొని ఇంటికి బయల్దేరాడు. ఆదివారం రాత్రి వరకు అతని ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం కాలనీలో దుర్వాసన రావడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమా చారం అందించారు. మృతుడిని జిలానీగా గుర్తించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య షహనాజ్‌ ఫిర్యాదు మేరకు బాన్సువాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..



సిరికొండ: మండలంలోని కొండూరు గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చెల్లం లక్ష్మి (60) మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. లక్ష్మి, ఆమె భర్త నడ్పి గంగయ్య కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గ్రామంలో ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం వీరి వాహనానికి తగిలింది. దీంతో భార్యాభర్తలు వాహనంపై నుంచి కిందపడిపోయారు. గాయాలపాలైన లక్ష్మిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి



శ్రీనివాస్‌ (ఫైల్‌)



రోదిస్తున్న కుటుంబీకులు

నస్రుల్లాబాద్‌: మండలంలోని నెమ్లి గ్రామ శివారులో ఉన్న పంట పొలాల్లో విద్యుదాఘాతంతో యువ రైతు మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బొబ్బిలి శ్రీనివాస్‌(39) నిజామాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో ఎక్స్‌-రే టెక్నీషియన్‌గా పనిచేస్తాడు. భార్య ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా ఉద్యోగం చేస్తుంది. శ్రీనివాస్‌ సోమవారం ఉదయం పొలానికి పురుగు మందు పిచికారీ చేసేందుకు వెళ్లాడు. ఉదయం వెళ్లిన వ్యక్తి మధ్యాహ్నం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పొలానికి వెళ్లి చూడగా పంట కాలువలో విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. పొలానికి స్ప్రే చేయడానికి మందులు తీసుకొని వచ్చి, బోరు ఆగిపోయి ఉండటంతో శ్రీనివాస్‌ స్టార్టర్‌ బాక్సులోని మూడు ఫ్యూజులలో ఒక ఫ్యూజు మాత్రమే తీసి బోరును ముట్టుకుని ఉన్నాడు. బోరు మోటారు నుంచి విద్యుత్‌ సరఫరా కావడం, పంట కాలువలో నీరు ఉండటంతో షాక్‌ తగిలి అక్కడిక్కడే షాక్‌ మృతి చెందాడన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్సై రాఘవేంద్ర పరిశీలించి మృతదేహాన్ని బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య రమ్య, కూతురు పర్ణిత, కొడుకు రియాంత్‌ ఉన్నారు.

నాన్నా... అంటూ చిన్నారి ఏడుపు

పొలాల మధ్య నుంచి శ్రీనివాస్‌ మృతదేహాన్ని రోడ్డుపైకి స్థానికులు తీసుకుని వచ్చారు. అప్పుడే పాఠశాల నుంచి వచ్చిన కూతురు పర్ణిత నాన్నా అంటూ ఒక్కసారిగా ఏడవడంతో స్థానికులు కన్నీరు మున్నీరయ్యారు.

కోతుల దాడిలో గాయపడ్డ వృద్ధుడు మృతి



కర్రె సిద్ధయ్య (ఫైల్‌)

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో కోతుల దాడిలో గాయపడ్డ వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన కర్రె సిద్ధయ్య (65)ను ఈ నెల 17న ఇంటి వద్ద కోతులు దాడి చేశాయి. దీంతో కిందపడిన ఆయన తుంటి ఎముక విరిగింది. వెంటనే కుటుంబీకులు ఆయనను చికిత్స నిమిత్తం కామారెడ్డిలోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. మూడు రోజుల క్రితం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన సిద్ధయ్య సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు బాబు, నలుగురు కుమార్తెలు లక్ష్మి, రేణుకా అనిత, లావణ్య ఉన్నారు.

పీజీలో వినూత్న కోర్సులు

● బీఆర్‌ఏవోయూ జేడీ రాజేందర్‌రెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అంబేద్కర్‌ వర్సిటీ జాయింట్‌ డైరెక్టర్‌ రాజేందర్‌రెడ్డి తదితరులు

నిజామాబాద్‌అర్బన్‌: డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీ జిల్లా ప్రాంతీయ కేంద్రంలో పీజీ సైన్స్‌ కోర్సులతోపాటు వివిధ వినూత్న పీజీ విద్యా కార్యక్రమాలను అందిస్తున్నామని వర్సిటీ జాయింట్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ రాజేందర్‌ రెడ్డి అన్నారు. సోమవారం కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైపుణ్య ఉపకార వేతన ఆధారిత విద్య కార్యక్రమాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని వర్గాలకు సమాన విద్య అవకాశాలను అందించేందుకు సమత, నిపుణ ఫెలోషిప్‌లు అందిస్తున్నామని తెలిపారు. నిజామాబాద్‌ అధ్యయన కేంద్రంలో ఈ విద్యా సంవత్సరం నుంచి పీజీ సైన్స్‌, లైబ్రరీ సైన్స్‌ కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిరాజ్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ రామ్మోహన్‌ రెడ్డి, ప్రాంతీయ సమన్వయ కేంద్రం కోఆర్డినేటర్‌ డాక్టర్‌ రంజిత, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ సునీల్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.